## క్లుప్తంగా

### ఘనంగా ఆర్యసమాజ్ వేదమందిరం వార్షికోత్సవం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఆర్యసమాజ్ వేద మందిరం 39వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరామ కోటి నామలిఖిత ప్రచారకులు కృష్ణనందస్వామి మాట్లాడుతూ వేదవిద్యను అందించడంతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను ఆర్యసమాజ్ మందిరం అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం దైవనామ స్మరణకోసం కొద్దిపాటి సమయాన్ని వెచ్చించాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ మందిరం ప్రతినిదులు నరేంద్ర ఆచార్య, ఓంకారనందస్వామి తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలో బేగంపూర్ గ్రామంలో ఆదివారం నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల కింద మంజూరైన రూ. 5లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మోహన్, శామప్ప పటేల్, గోపాల్, ఓంకార్, శంకర్, హైమద్, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**డ్రెయినేజీ నిర్మాణ పనులు..**



ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని ఆరో వార్డులో ఆదివారం రూ. 5 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు కాంగ్రెస్ నాయకులు సూచించారు.

### రథోత్సవానికి సర్వం సిద్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథ్‌గల్లీలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం, మంగళవారం నిర్వహించే రథోత్సవ వేడుకలకు నిర్వహకులు సర్వం సిద్ధం చేశారు.ఆలయ కమిటీ, గ్రామస్తు ల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రథానికి అందంగా రంగులు దిద్ది, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలకరించారు. ఈ నెల 13న కుస్తీ పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి గల వారు పాల్గొనాలని వారు కోరారు.

### పిల్లర్లకే పరిమితమైన అదనపు గది నిర్మాణం



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం ఎస్సీ వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా అదనపు గది నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికి అదనపు గది అందుబాటులోకి రాలేదు. దీంతో ఐదు తరగతులు ఉన్న ఈపాఠశాలలో అన్ని తరగతులు ఒకేగదిలో నిర్వహించాల్సి వస్తోంది. ప్రారంభించిన 2నెలలకే నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి పూర్తిచేయించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గది పనులు పూర్తిచేయించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

కామారెడ్డి అర్బన్ : పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 9గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాస్‌రావు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# పొలాల్లో పశువుల మంద

- మేకల, గొర్రెల, ఆవుల ఎరువుతో భూసారం పెరుగుదల
- సేంద్రియ సాగుతో మెండుగా లాభాలు



నెమ్లిలో పంట పొలాల్లో ఉన్న ఆవుల మంద



అంకోల్ గ్రామంలో పంట పొలాల్లో ఉన్న గొర్రెల మందలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): యాసంగిలో సాగు చేసిన పంటలు రైతుల చేతికందాయి. పంట సాగు చేసిన పొలాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పంట పొలాల్లో భూసారం పెంచుకోవడానికి రైతులు గొర్రెల, మేకల, ఆవుల మందను కట్టించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అందులో భాగంగానే ఎల మందలు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతం నుంచి గొర్రెలు, మేకలు, ఆవులను తీసుకుని జిల్లాలో పర్యటిస్తున్నారు. పంట చేలు ఖాళీగా ఉండటంతో మందలను వాటిలో నిలుపుతున్నారు. మూగజీవాల మల, మూత్రాలతో సేంద్రియ ఎరువులుగా మారి పంట భూములకు అవసరమైన పోషకాలను అందిస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మంద కట్టడం వలన సేంద్రియ ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాష్, కాల్షియం, మాంగనీస్, ఇనుము, ఉదజనులు పుష్కలంగా ఉంటాయి. పొలాల్లో గొర్రెల, మేకల మందలు కట్టించడం వలన సీజన్‌లో వేసే పంటలకు మేలు జరుగుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. భూమికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు భూమి పటిష్టతను పెంపొందిస్తుందని వివరిస్తున్నారు. ప్రస్తుతం అవకాశం ఉన్న రైతులు తమ పొలాలు ఖాళీ గా ఉండటంతో గొర్రెలు మేకలతో మంద కట్టించుకోవాలనుకుంటున్నారు.

**జీవాల మల,మూత్రాలే జీవన ఎరువు**

గొర్రెలు,మేకల దొడ్లలో ఎరువులను పశువుల ఎరువుల మాదిరిగా నిల్వ చేసి పొలానికి వాడుకోవచ్చు. వరి కోత పూర్తవ్వగానే ఆయా పంట పొలాల్లో జీవాలను మంద కట్టిస్తున్నారు. మంద కట్టిస్తే జీవాలు మల మూత్రాలను విసర్జిస్తాయి. అవి సేంద్రియ ఎరువుగా భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మంద కట్టిన తర్వాత ఒకసారి పొలాన్ని దుక్కి దున్నిస్తే ఎరువు నేలలో కలిసిపోయి పోషకాలు వృథా కాకుండా ఉంటాయి.

**మంద కట్టడమే వారి జీవనం**

పంట పొలాల్లో మేకలు, గొర్రెలను, ఆవులను మంద కట్టించడం ద్వారా పెంపకందార్లు జీవనం సాగిస్తారు. ఎకరం పొలంలో సుమారు వెయ్యి వరకు జీవాలను మంద కట్టిస్తారు. ఇందుకుగాను రైతు ఒక్కొక్కరు రూ.500 నుంచి 600 వరకు పెంపకందార్లకు ఇస్తారు. వారిచ్చే పైకంతోనే వారి జీవనం సాగుతుంది. సుదూర ప్రాంతాలను తిరుగుతూ నెలలో కేవలం వారం రోజులు మాత్రమే కుటుంబ సభ్యులతో ఉంటారు. ఊహ తెలిసిన నాటి నుంచి వృద్ధాప్యం వచ్చే వరకు వారి జీవనమే మంద కట్టడంగా మార్చుకుని జీవిస్తున్నారు.

### పంట చేల్లో సేంద్రియ ఎరువు



రైతులు గొర్రెల, మేకల మందలను కట్టించడంతో పొలంలో పోషకాలు మెరుగు అవుతాయి. పంట మీద పంట వేయడం వలన సారం తగ్గి పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. సేంద్రియ ఎరువులతో పంట చేల్లో సారం పెరుగుతుంది. సేంద్రియ సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరచాలి.

– భవాని, మండల వ్యవసాయ అధికారిణి

### రైతులు ఆసక్తి చూపుతారు



పంట కోతలు ముగిసాక మంద కట్టించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. వారిచ్చే డబ్బుతో పూట గడుపుకుంటాం. నెలలో వారం రోజుల పాటు ఇంటికి వెళ్లి వస్తాం.తరాలుగా వచ్చిన పనే చేస్తున్నాం.

– రాజేందర్, ఎలమంద

# మైదానంలో ఆహ్లాదం



ఓపెన్ జిమ్‌లో చిన్నారులు



లైటింగ్ వెలుగులో మైదానం

- రామారెడ్డి స్కూల్ గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు
- రాత్రి వరకు ఆటలకు ప్రాధాన్యత
- మినీ స్టేడియంగా మారిస్తే మరింత మేలు

రామారెడ్డి: రాష్ట్రవ్యాప్తంగా క్రీడల గ్రామంటే గుర్తొచ్చేది రామారెడ్డి గ్రామం. అన్ని రకాల క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎంతోమంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇందుకు ప్రధాన కారణం సువిశాలమైన మైదానం అందుబాటులో ఉండడమే. గత జీపీ పాలక వర్గం క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు మైదానంలో ఫ్లడ్‌లైట్లను, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. దీంతో రాత్రి 9 వరకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వివిధ క్రీడలు ఆడుతూ, వాకింగ్, సైక్లింగ్ చేస్తూ సరదాగా ముచ్చటిస్తూ మైదానంలో గడుపుతున్నారు.

**సెల్ ఫోన్లకు దూరం**

సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ యువత, వృద్ధులు, మహిళలు తమకు ఇష్టమైన క్రీడలు ఆడుతూ జిమ్ చేస్తూ, వాకింగ్ జాగింగ్ యోగా లాంటి కార్యక్రమాలు చేస్తూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.రామారెడ్డి క్రీడా మైదానాన్ని మినీ స్టేడియంగా మారిస్తే క్రీడకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. ఈవిషయం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారు.

## తలమడ్ల, తాడ్వాయిల మధ్య వాలీబాల్ మ్యాచ్



వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు

రాజంపేట: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో తలమడ్లలో నిర్వహిస్తున్న వాలీబాల్ సమ్మర్ క్యాంప్ కొనసాగుతోంది. ఈసందర్భంగా ఆదివారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో తాడ్వాయి, తలమడ్ల అండర్ 14/17 క్రీడాకారులకు ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించినట్లు వాలీబాల్ కోచ్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ బాలు మాట్లాడుతూ.. ఈ సమ్మర్ వాలీబాల్ క్యాంప్ ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. క్యాంప్ పూర్తి అయ్యేలోపు మరిన్ని ఫ్రెండ్లీ మ్యాచ్‌లు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తాడ్వాయి పీడీ సంగారెడ్డి, తాడ్వాయి సీనియర్ క్రీడాకారులు స్వామి, సాయికుమార్, తలమడ్ల సీనియర్ క్రీడాకారులు బాబాగౌడ్, సృజన్, శ్రవణ్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బ్రహ్మకుమారీలు

కామారెడ్డి అర్బన్: అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగిని బీకే జయదిదీ అన్నారు. ఆదివారం స్థానిక పంచముఖి హనుమాన్ కాలనీలోని ఓంశాంతి కేంద్రంలో మాతృదినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు గంగ, లలిత, సంతోషి, కవిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

**‘మహిళలు తమలో దాగి ఉన్న శక్తిని బయటకు తీయాలి’**

మహిళలు తమలో దాగి ఉన్న శక్తిని బయటకు తీయాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం, బాంధవ్యాలు, సఖ్యత, సౌభాగ్యం కోసం నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కల్కి భగవాన్ ప్రణయ దాసాజీ అన్నారు. స్థానిక నిజాంసాగర్‌రోడ్డులోని కల్కినగర్ శ్రీపరంజ్యోతి కల్కి భగవతి భగవానుల ఆలయంలో ఆదివారం మాతృదినోత్సవం స్త్రీ శక్తి వరం కార్యక్రమం నిర్వహించారు. అంతర్గంగా ఉన్న శక్తితో జీవితంలో సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు.

# ఛత్రపతి శివాజీ బాటలో నడవాలి



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీబీపాటిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఛత్రపతి శివాజీ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎంపీ బీబీపాటల్ అన్నారు. మండలంలోని కన్‌కల్ గ్రామంలో ఆదివారం ఆర్యక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. శివాజీ తన తల్లికి ఇచ్చిన మాట ప్రకారం యుద్ధం చేసి అన్నివర్గాల వారికి న్యాయం చేశాడన్నారు. దేశరక్షణ కోసం, సనాతన ధర్మాన్ని రక్షించడానికి శివాజీ ఎంతో కృషిచేశాడన్నారు. ఈ సందర్భంగా ఆర్యక్షత్రీయ సంఘం నాయకులు ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రిరాంరెడ్డి, హరిస్మరణరెడ్డి, తానాజీరావు, శివాజీరావు, లింగారావు, ఆనంద్ రావు, మనోహర్‌రావు, హంసాంజీరావు, విక్రంరావు, రాంచందర్‌రావు, గ్రామపెద్దలు సంతోష్‌రెడ్డి, సాయిరెడ్డి ,కిష్టారెడ్డి, వివిధ గ్రామాల ఆర్యక్షత్రీయసంఘం, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పగలే వెన్నెల..



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తండా పంచాయతీ కార్యాలయంపై పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నా గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరాయంగా పగలుకూడా వెలుగుతునే ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ వృథాను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందిస్తున్న మాజీ సర్పంచ్ సాయిరాం



చందాపూర్‌లో..కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎల్లారెడ్డి: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో బాధితురాలికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం మాజీ సర్పంచ్ సాయిరాం అందించారు. గ్రామానికి చెందిన కుర్మ భాగ్యలక్ష్మికి రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

**తాడ్వాయి మండలంలో..**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చందాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. రెండుగ్రామాలలో ఏడుగురికి సుమారు రూ.6 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, షౌకత్‌అలీ, లక్ష్మణచారి, శివాజీ, మోహన్‌రెడ్డి, గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### మిత్రుడికి ఆర్థిక చేయూత



రాజంపేట : మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన పుట్టకొక్కుల స్వామి కొన్ని రోజుల క్రితం కారు యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. ఈవిషయం తెలుసుకున్న 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం పుట్టకొక్కుల స్వామికి రూ. 43 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించిన మిత్రబృందానికి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

### భక్తులు సన్మార్గంలో నడవాలి



ఎల్లారెడ్డి : భక్తులు సన్మార్గంలో నడవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి సరస్వతి అన్నారు. ఆదివారం పట్టణంలో స్వామి వారి పాదుకార్చన, శత రుద్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తుల నుద్దేశించి ప్రసంగిస్తూ భక్తులు ప్రతి ఒక్కరు దేవుడిని ఆరాధించాలన్నారు. దైవారాధనతో ఎలాంటి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాయిప్రకాష్ దేశ్‌పాండే, ప్రణయ్ కుమార్, శేఖర్ శర్మ, నర్సింహారావు, శ్రీధర్ జోషి, రాజేశ్వర్‌శర్మ తదితరులున్నారు.

### అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



బాన్సువాడ రూరల్: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బాన్సువాడ డీఎల్‌పీవో వెంకట సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం ఎంపిక కోసం రీ–సర్వే చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన లబ్ధిదారుల ఇళ్లకు పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధన ప్రకారమే ఇంటినిర్మాణం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు మాత్రమే ముందుకు రావాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సృజన్‌రెడ్డి ఉన్నారు.

### ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించండి

బాన్సువాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ చదువుతున్న 2,4,6 సెమిస్టర్ విద్యార్థులు ఈనెలాఖరులోగా పరీక్ష ఫీజు చెల్లించాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డా. వేణుగోపాల స్వామి తెలిపారు. పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో లేదంటే కళాశాలలో నేరుగా సంప్రదించి చెల్లించవచ్చన్నారు. 6వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 20నుంచి 25వరకు, 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 26నుంచి జూలై 2 వరకు, రెండో సెమిస్టర్ పరీక్షలు జూలై 4నుంచి 10 తేదీ వరకు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆధ్యాత్మికం

### ఘనంగా లక్ష్మీనర్సింహుడి జయంతి



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి కార్తిక్, లాస్య కూచిపూడి కళాక్షేత్రం వారు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం నృత్యం చేసిన కళాకారులకు ఆలయ నిర్వహకులు శాలువాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మిరాజం, రాజిరెడ్డి, ఆంజనేయులు, ఈవో శ్రీధర్‌రావ్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

**భక్తి శ్రద్ధలతో నరసింహ యజ్ఞం**



కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహించే ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తనవంతుగా అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని బీజేపీ నాయకులు, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో నృసింహ జయంతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా నరసింహ యజ్ఞం, అర్చన, భజనలు, భక్తితో నృత్యాలు చేశారు. ఉత్సవంలో పాల్గొన్న పైడి ఎల్లారెడ్డి పూజలు నిర్వహించి మాట్లాడారు. స్థానిక ఇస్కాన్ అధ్యక్షుడు వెంకట దాస్ ప్రభు, ప్రతినిధులు పాల్గొన్నారు.

**దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు**



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలకు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా దేవతా విగ్రహాలకు ఊరేగింపు చేశారు. గ్రామంలోని వీధుల్లో భజనలు చేస్తూ భక్తి భావంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కోరమండల్ సాయాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకాగౌడ్, రమేశ్‌గౌడ్, సాయాగౌడ్, బానుగౌడ్, గంగాధర్‌గౌడ్, విఠల్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.

**కొనసాగుతున్న వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు**



రాజంపేట : మండలకేంద్రంలో శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పూజారి గౌరినాథ్ శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు సామూహిక నవదుర్గ వ్రతం**

కామారెడ్డి అర్బన్: స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీశారదామాతా ఆదిశంకర ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం సామూహిక శ్రీనవదుర్గ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.మహిపాల్‌రెడ్డి తెలిపారు. సామూహిక నవదుర్గ వ్రతంలో పాల్గొనే భక్తులకు ఆలయ కమిటీ తరపున పూజాసామాగ్రి అందిస్తామన్నారు.

## సంక్షిప్తం

**గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులు**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. వలసల నివారణ కోసం కూలీలతో ఉపాధి పనులు చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో బోరుబావుల వద్ద ఫాంపాండ్స్ నిర్మాణం, భూగర్భ జలాల పెంపుదల కోసం ఇంకుడు గుంతలు, చేపల చెరువులు, ఫార్మేషన్ రోడ్ల పనులు చేపడుతున్నారు. గ్రామాల్లోని అన్ని గ్రామాల చెరువుల వద్ద చేపల చెరువులు తవ్విస్తున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. 41 గ్రామ పంచాయతీల పరిధిలో 16వేల మంది కూలీలు పనులు చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**పాకిస్తాన్ జాతీయ పతాకం ధ్వంసం**

భిక్కనూరు : యూత్‌కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో భిక్కనూరు మండల కేంద్రంలో పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని ఆదివారం ధ్వంసం చేశారు. పాకిస్తాన్ అమాయక పౌరులను మట్టుబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, నేతలు, ప్రదీప్, జీవన్, వంక కిరణ్, జిట్టార ఆజు తుడుం ప్రదీప్, శ్రవన్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి పరామర్శ**



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్‌తండాకు చెందిన పీఆర్టీయూ సీనియర్ నాయకుడు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఈశ్వర్ గత బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం దినకర్మ సందర్భంగా రాష్ట్ర పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి బాణాపూర్ తండాకు వచ్చి ఈశ్వర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మృతుడికి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ సంఘం ఆధ్వర్యంలో ఇప్పిస్తామన్నారు. కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

**నేడు అయిలాపూర్‌లో కుస్తీ పోటీలు**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని దుర్గామాత ఆలయం వద్ద సోమవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దుర్గమ్మ ఆలయం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కుస్తీ పోటీల్లో టెంకాయ కుస్తీ నుంచి మొదటి బహుమతి 3 తులాల వెండి కడెం, ద్వితీయ బహుమతి 2 తులాల వెండి కడెం బహుకరించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.